క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే జోగులు పరామర్శ



ఎంపీటీసీని పరామర్శించిన కంబాల జోగులు

పాయకరావుపేట: మండలంలో పాల్తేరు ఎంపీటీసీ ఇసరపు సత్యనారాయణ ఇటీవల చేతికి ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్దనే విశ్రాంతి పొందుతున్నారు. ఆయనను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు శనివారం పరామర్శించి, ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. మండల మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, మాసాహేబుపేట, గోపాలపట్నం, పాల్మన్‌పేట, పెంటకోట సర్పంచ్‌లు గెడ్డమూరి శ్రీనివాసరావు, పన్నీరు పాపారావు, కోడ కోటేశ్వరరావు, చేపల నాగమణి తాతాజీ, పార్టీ జిల్లా కార్యదర్శి దేవవరపు వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

108 కలశాలతో ఊరేగింపు



కోటవురట్లలో కలశాలతో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

కోటవురట్ల: స్థానిక వరాహనది తీరాన వేంచేసిన గణపతి ప్రయుక్త కనకదుర్గమ్మ ఆలయంలో వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గ్రామ శాంతిని కోరుతూ హోమం చేశారు. ప్రత్యేక పూజలు, అష్టోత్తర కలశాభిషేకం చేశారు. అనంతరం 108 కలశాలతో శాకాంబరి అవతారంలో అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అర్చకుడు కొత్తలంక బ్రహ్మయ్యశర్మ మాట్లాడుతూ గ్రామంలోకి ఏ దుష్టశక్తి ప్రవేశించకుండా, ప్రజలంతా శాంతి సౌభాగ్యాలతో జీవించేలా హోమం, కలశాభిషేకం, 108 కలశాల ఊరేగింపు నిర్వహించినట్టు తెలిపారు.

భజన చెట్టు ఊరేగింపు



కొత్త భజన చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

యలమంచిలి రూరల్: మండలంలోని ఏటికొప్పాకలో శనివారం భజన చెట్టు ఊరేగింపు కార్యక్రమం శనివారం వైభవంగా జరిగింది. ఇక్కడ నడివీధి రామాలయానికి గొంతుమూర్తి నూకరాజు దంపతులు కొత్త భజన చెట్టును బహూకరించారు. దీనికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన తర్వాత గ్రామంలో ఊరేగించారు. అనంతరం రామాలయం వద్ద అన్న సమారాధన చేపట్టారు. కార్యక్రమంలో యలమంచిలి జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సేనాపతి రాము, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఉద్దండం త్రినాథరావు(యూటీఆర్), వార్డు సభ్యులు సెనంశెట్టి నాయుడు, రావి చలపతి, దేవరాపల్లి రమణ, గ్రామ పెద్దలు అన్నం సరోజరావు, వీసం బంగారుబాబు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక హారతి



సామూహిక హారతిలో భక్తులు

మునగపాక: స్థానిక వేపచెట్టు రామాలయంలో శనివారం రాత్రి సామూహిక హారతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రతీ పౌర్ణమి రోజున ఆలయంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నారు. దీనిలో భాగంగా ఏర్పాటు చేసిన సామూహిక హారతి కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో భజనలు చేశారు.

జాజిగెడ్డ ఆక్రమణల పరిశీలన

మాకవరపాలెం : జాజిగెడ్డ రిజర్వాయర్ ఆక్రమణలను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. మండలంలోని పాపయ్యపాలెంలో ఉన్న జాజిగెడ్డ రిజర్వాయర్ ఆక్రమణలకు గురైందని రైతులు ఇటీవల తహసీల్దార్ వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. ఆక్రమణల కారణంగా రిజర్వాయర్ గర్భం కుదించుకుపోతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శనివారం తహసీల్దార్‌తో పాటు ఇరిగేషన్ అధికారులు ఈ రిజర్వాయర్ ఆక్రమణలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రికార్డుల ప్రకారం రిజర్వాయర్ గర్భాన్ని పూర్తిస్థాయిలో సర్వే చేసి ఆక్రమణలు తొలగిస్తామన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

జగనన్న కాలనీలపై వివక్ష





డ్రైనేజీ కాలువకు నోచుకోని మునగపాక జగనన్న కాలనీ

- కానరాని మౌలిక సదుపాయాలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- నాడు అర్హులకు పట్టాతోపాటు ఇళ్ల నిర్మాణానికి చేయూత
- నేడు కాలనీల్లో అధ్వానంగా రహదారులు

మునగపాక: కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీలపై వివక్ష చూపుతోంది. అక్కడ ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. అరకొర సౌకర్యాలతో ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ పట్టాలు మంజూరు చేయడంతో పాటు పక్కా ఇళ్ల నిర్మాణానికి అవసరమయ్యే సాయం అందించారు. దీంతో ఎక్కడ చూసినా జగనన్న కాలనీలు దర్శనమిస్తున్నాయి. వీటిపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది.

23 లే అవుట్‌లు..725మంది లబ్ధిదారుల ఎంపిక...

మండల వ్యాప్తంగా 21 గ్రామ సచివాలయాలకు గాను 23 లే-అవుట్లు ఎంపిక చేశారు. ఇందుకోసం 725మంది లబ్ధిదారులను గుర్తించారు. కొన్ని గ్రామాల్లో స్థలాలు లేకపోతే రైతుల నుంచి కొనుగోలు చేసి కాలనీలు ఏర్పాటు చేశారు. వాటిలో 435 ఇళ్లు పూర్తి కాగా, 34 గృహాలు స్లాబ్ స్థాయిలోనూ, 29గృహాలు గోడల స్థాయిలోనూ, 16 గృహాలు సన్‌షేడ్ స్థాయిలోనూ, 150 ఇళ్లు పునాది స్థాయిలోనూ ఉండగా, మరికొంతమంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఇంటి నిర్మాణానికి రూ.1.50 లక్షలతో పాటు ఉపాధి హామీ పథకం ద్వారా రూ.30 వేలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.12 వేలు వెరసి రూ.1.92 లక్షల మేర సాయం అందేది. దీనికి తోడు లబ్ధిదారుడు తనవంతుగా కొంతసొమ్ము జత చేసుకొని ఇంటి నిర్మాణం పూర్తి చేసుకునేవారు.

కాలనీల్లో కానరాని మౌలిక సదుపాయాలు...

మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మంజూరైన కాలనీలకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాలు, తాగునీటి సదుపాయాలు లేక పలువురు అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల పక్కా రోడ్లు లేక రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వస్తే చాలు కాలనీల్లో నివాసం ఉండే వారు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రధాన రహదారులు బురదమయంగా ఉండడంతో అవస్థలు నడుమ రాకపోకలు సాగించాల్సి వస్తుంది.



తిమ్మరాజుపేట-వాడ్రాపల్లి జగనన్న కాలనీ



పక్కారోడ్డుకు నోచుకోని తిమ్మరాజుపేట-వాడ్రాపల్లి జగనన్న కాలనీ రోడ్డు

పేదోడి సొంతింటి కల జగన్‌తోనే సాధ్యం...

పేదోడి సొంతింటి కల మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమైంది. గతంలో ఇళ్లు కావాలంటే అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పదే పదే తిరగాల్సి వచ్చేది. అటువంటి సందర్భంలో అర్హులైన ప్రతీ పేదవాడికి పక్కా ఇళ్లు అందించేందుకు అప్పట్లో పనిచేసిన వలంటీర్ వ్యవస్థను వినియోగించి లబ్ధిదారుల ఎంపిక పక్కా చేపట్టి అర్హులను గుర్తించేవారు. తన హయాంలో ప్రతి పేదవానికి పక్కా ఇళ్లు మంజూరు కావాలన్నదే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి ఆశించారు. తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇంతవరకు ఒక్కరికీ ఇళ్ల స్థలం మంజూరు చేసిన దాఖలాలు లేవన్న ఆరోపణలు ఉన్నాయి.

> **పైలట్ గ్రామంగా ఎంపిక చేసి సౌకర్యాలు**
>
> జగనన్న కాలనీల్లో సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. మండలంలోని ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అక్కడ పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. తద్వారా ప్రతీ జగనన్న కాలనీలో సదుపాయాలు కల్పించే వీలుంటుంది. పైలట్ గ్రామం ఎంపికపై కసరత్తు జరుగుతుంది.
>
> – రాము, హౌసింగ్ ఏఈ, మునగపాక



మునగపాక జగనన్న కాలనీలో వినియోగంలోకి రాని కుళాయి

అన్నా.. నీ అనురాగం...రక్షానుబంధం

ఆనందోత్సాహాల మధ్య రాఖీ పండగ



ఆక్సాహేబుపేటలో తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క



అన్నకు రాఖీ కడుతూ అభిమానాన్ని చాటుతున్న సోదరి



రేవుపోలవరంలో అన్నయ్యకు రాఖీ కడుతున్న చెల్లి



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీ అక్కయ్య శ్యామల



సోదరులకు రాఖీ కట్టిన సోదరీమణి

నక్కపల్లి/కోటవురట్ల/పాయకరావుపేట/ఎస్.రాయవరం: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షా బంధన్‌ను శనివారం ఉత్సాహంగా జరుపుకున్నారు. చిట్టి తమ్ముళ్లకు అక్కలు, అన్నయ్యలకు బుల్లి చెల్లెమ్మలు నుదుటన కుంకుమ దిద్ది, చేతికి రాఖీ కట్టి తమ ఆత్మీయతను చాటారు. మిఠాయి తినిపించి ప్రేమానురాగాలు పంచుకున్నారు. సోదరికి కానుకలు ఇచ్చి బంధాలను పదిలం చేసుకున్నారు. ఈ సందర్భంగా లోగిళ్లలో సందడి వాతావరణం నెలకొంది.

మునగపాక: మండల వ్యాప్తంగా శనివారం రాఖీ వేడుకను ఘనంగా జరుపుకున్నారు. అక్కలు తమ్ముళ్లకు, చెల్లెళ్లు అన్నలకు రాఖీ కట్టి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దీనిలో భాగంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్‌కు మునగపాక బ్రహ్మకుమారీస్‌కు చెందిన అక్కయ్య శ్యామల రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా గణపతి ఆలయ ప్రారంభోత్సవం



గణపతిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నక్కపల్లి: మండలంలో తమ్మయ్యపేటలో నూతనంగా నిర్మించిన గణపతి ఆలయ ప్రారంభోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో వేదపండితుల వేదమంత్రోచ్చారణల మధ్య గణపతి హోమం, మండప ఆరాధన, గణపతి పూజ వంటి కార్యక్రమాలు జరిగాయి. తమ్మయ్యపేట, చందనాడ, తుమ్మలపేట తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వీసం రామకృష్ణ, చందనాడ సర్పంచ్ తళ్ల రోహిణీ భార్గవ్, ఎంపీటీసీ గంటా తిరుపతిరావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కే వెంకటేష్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద అన్న సమారాధన కార్యక్రమం జరిగింది.

కుండపోత వర్షంతో హర్షం



చెరువును తలపిస్తున్న కోటవురట్ల మెయిన్‌రోడ్డు

కోటవురట్ల: మండలంలో శనివారం కుండపోత వర్షం కురిసింది. తెల్లవారు జామున సుమారు రెండు గంటల పాటు దంచి కొట్టగా మళ్లీ సాయంత్రం మరోసారి ఎడాపెడా కురిసింది. రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తుపాకుల గెడ్డలోకి చాలా కాలానికి జలకళ చేరింది. ఎప్పటిలానే మండల పరిషత్ కార్యాలయం ఎదుట భారీగా వర్షం నీరు నిలిచిపోయి చెరువును తలపించింది. రోడ్డు నిండిపోవడంతో పాటు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోకి ప్రవహించింది. వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. పాదచారులు నడిచే దారిలేక అవస్థలు పడ్డారు. మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. చాలా కాలంగా ఇక్కడ సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండలవాసులు మండిపడుతున్నారు. కనీసం ప్రజా ప్రతినిధులు కూడా దృష్టి సారించ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పలు ఆలయాలకు విరాళాలు



సత్తెమ్మతల్లికి విరాళం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్



గంగాలమ్మతల్లి గుడికి విరాళం అందజేస్తున్న భక్తుడు

మునగపాక: మండలంలోని పలు గ్రామాల్లో నిర్మిస్తున్న ఆలయాలకు భక్తులు తమవంతు విరాళాలు అందజేస్తున్నారు. మునగపాకలో చెరువు కాలువ సంఘ పరిధిలో నిర్మిస్తున్న సత్తెమ్మతల్లి గుడికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ శనివారం రూ.లక్ష ప్రకటించి ముందుగా రూ.50 వేలను కమిటీ సభ్యులకు అందజేశారు. కమిటీ సభ్యులు దాడి చంద్రరావు, వెలగా అప్పలనాయుడు, కర్రి రామజోగినాయుడు, వెలగా వెంకటప్పారావు, వెలగా శ్రీనివాసరావు, బొడ్డేడ వెంకట సత్యనారాయణ, శిలపరశెట్టి సూరిబాబు, వెలగా ధర్మసూరి పాల్గొన్నారు. పాటిపల్లి-మంగళవరపుపేట గ్రామ సరిహద్దులో నిర్మిస్తున్న గంగాలమ్మ తల్లి గుడికి స్వర్గీయ రాపేటి సత్యనారాయణ, మాణిక్యం దంపతుల కుమారుడు అప్పలనాయుడు, సాయిలాదేవీ దంపతులు రూ.5,133 విరాళంగా కమిటీ సభ్యులకు అందజేశారు.

ప్రత్యేక డీఎస్సీ ఏర్పాటు చేయాలి

నర్సీపట్నం : గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ ఏర్పాటు చేయాలని ఆదివాసి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ధనార్జన్, ధర్మరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసి దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని అబిద్‌సెంటర్‌లో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గిరిజనుల న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఏజన్సీ ముఖద్వారమైన నర్సీపట్నంలో గిరిజన భవనం నిర్మాణానికి స్థలాన్ని మంజూరు చేయాలని కోరారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

అనకాపల్లి టౌన్: వివాహిత అదృశ్యంపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. పట్టణంలోని ఉప్పలవారి వీధికి చెందిన డేగ్గంపూడి సరోజిని (45) ఈ నెల 6న తన ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాకపోవడంతో శనివారం ఆమె సోదరుడు వెంకటేశ్వరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భాస్కరరావు తెలిపారు.


వైభవంగా కామాక్షిదేవి, ఏకాంబరేశ్వరుడి కల్యాణం

అనకాపల్లి: శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని శనివారం స్థానిక గవరపాలెం, నిదానందొడ్డి కామాక్షిదేవి ఆలయం మండపంలో కామాక్షిదేవి, ఏకాంబరేశ్వరుడి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణంలో విశ్వబ్రాహ్మణ పట్టణ సంఘం అధ్యక్షుడు పొన్నాడ వెంకట సత్య నరసింహచారి (పెదబాబు), వెంకటరత్నం వేణు దంపతులు పాల్గొన్నా రు. అనంతరం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆలయ ఆవరణలో పలువురు దంపతులతో చేయించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ పట్టణ సంఘం ప్రధాన కార్యదర్శి ఎండపల్లి మోహన్ బ్రహ్మాజీ, కోశాధికారి కిలాడ శ్రీనివా సరావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కామాక్షిదేవి, ఏకాంబరేశ్వరుడి కల్యాణంలో భక్తులు

ఆలస్యంగా వరినాట్లు



సాగునీరు లేని భూములు



మోటారు బోరుల వద్ద దమ్ము చేస్తున్న రైతులు

పాయకరావుపేట: సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో గ్రామాల్లో రైతులు వరినాట్లను వడివడిగా వేస్తున్నారు. మండలంలో 2,350 హెక్టార్లలో నాలుగు వేల మంది రైతులు వరినాట్లు వేయడానికి సిద్ధమవుతున్నారు. వర్షాలు సకాలంలో పడకపోవడంతో ఆలస్యంగా నాట్లు వేస్తున్నారు. జూన్ నెలాఖరున వరినారు పోసి ఆగస్టు మొదటి వారంలోనే ముమ్మరంగా నాట్లు వేసేవారు. ప్రస్తుత ఖరీఫ్ కాలంలో వర్షాలు సకాలంలో పడకపోవడంతో నారు పెరుగుదల కూడా ఆశాజనకంగా లేదు. అందువల్ల రైతులు వరినాట్లు వేయడం ఆలస్యమవుతోంది. వరి నారుమడులు వేసి 20 రోజులవుతున్నా వర్షాలు లేక ఏపుగా నారు పెరగలేదు. మరో వైపు తాండవ నీరు సరఫరా కాకపోవడంతోపాటు వర్షాలు లేక చెరువుల్లో నీరు నిల్వ ఉండకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. మండలంలో పాల్తేరు, గుంటపల్లి, మంగవరం, గోపాలపట్నం తదితర గ్రామాల్లో సాగునీరు సరఫరా కావడం లేదు. ముందుగా మోటారు పంపుల వద్ద నీటితో వరినాట్లు వేస్తున్నారు. ఇప్పటివరకు 20 హెక్టార్లలో నాట్లు వేసినట్లు ఏవో ఆదినారాయణ తెలిపారు. ఈ నెలాఖరు నాటికి వర్షాలు పడకపోయినా తాండవ రిజర్వాయర్ నీరుతో వరినాట్లు వేసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు.

గిరిజనుల హక్కుల కోసం ఆందోళన



గిరిజనులు హక్కులను కాపాడాలని డిమాండ్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ ఎస్టీ

నాతవరం : రాజ్యాంగంలో గిరిజనులకు కల్పించిన హక్కులను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బండి గంగరాజు అన్నారు, ఆయన శనివారం ప్రపంచ ఆదివాసీల దినోత్సవం సందర్భంగా సరుగుడు పంచాయతీ శివారు రామన్నపాలెంలో గిరిజన సంక్షేమ హైస్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మైదాన ప్రాంతంలో గిరిజనులకు అన్ని విధాలుగా అన్యాయం జరుగుతుందన్నారు. పాడేరు ఐటీడీఏ ద్వారా అనేక సంక్షేమ పథకాలు మైదాన ప్రాంత గిరిజనులకు అందించేవారన్నారు. 1/70 యాక్టు పరిధిలో గిరిజనులు నిబంధనల ప్రకారం ఎలాంటి పనులు జరగడం లేదన్నారు. ఆదివాసీల దినోత్సవాలు చేయడం తప్ప చంద్రబాబు ప్రభుత్వంలో గిరిజనులకు ఎలాంటి మేలు జరగదన్నారు. మైదాన ప్రాంత గిరిజనులకు ఐటీడీఏ పరిధిలో వారికి అందించే ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.